క్లుప్తంగా

యువతకు ప్రభుత్వం ప్రోత్సాహం

చిక్కడపల్లి: ప్రభుత్వం యువతకు అండగా ఉందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. యువ పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహంలో భాగంగానే టీఎస్‌ఐపాస్ ద్వారా సత్వర అనుమతులు అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. సోమవారం గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన దోస్త్‌ఫుడ్ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత ఉపాధి పొందుతూ మరికొంత మందికి ఉపాధి అందించే దిశగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్టు నిర్వాహకులు కవితాజాన్, బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠాజైసింహ, ఎన్‌టీపీసీ రిటైర్డ్ జనరల్ మేనేజర్ రాజేందర్, నల్లబాబు, డాక్టర్ రాజేందర్, శ్యామ్‌సన్, బీఆర్‌ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, గుండు జగదీశ్‌బాబు, రవిశంకర్ గుప్తా, కిరణ్‌కుమార్, వెంకటేష్ తదితరులున్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలి



మాట్లాడుతున్న కృష్ణమూర్తి, తదితరులు

చిక్కడపల్లి: ఈ– పీఎఫ్ పెన్షనర్లకు రూ.9వేల కనీస పెన్షన్ చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం చిక్కడపల్లిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు పోతుల నారాయణరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈపీఎఫ్ పెన్షనర్ల హయ్యర్ పెన్షన్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. నూతన వేతన సవరణ కమిషనర్‌ను నియమించాలని పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ ఈనెల చివరిలోగా చెల్లించాలన్నారు. అసోసియేషన్ సభ్యులు తదితరులున్నారు.

ఇంటి నిర్మాణ పనులను అడ్డుకున్న వారిపై కేసు

కాచిగూడ: ఉద్దేశపూర్వకంగా ఇంటి నిర్మాణ పనులను అడ్డుకున్న వ్యక్తితో పాటు అతడికి సహకరించిన కుటుంబ సభ్యులపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. అడ్మిన్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడలో లక్ష్మీ (50) తన ఇంటి నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ నుంచి అన్ని అనుమతులు తీసుకుని ఇంటిని నిర్మిస్తుండగా.. ఇంటి పక్కన ఉండే మల్లికార్జున్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు ఆ ఇంటి నిర్మాణంతో తమకు ఇబ్బంది కలుగుతుందని ఆ ఇంటి నిర్మాణ పనులను ఉద్దేశ పూర్వకంగా అడ్డుకున్నారని సమాచారం. దీంతో ఇరు కుటుంబాల మధ్య గొడవ జరగగా.. లక్ష్మీ కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అడ్డుకున్న వ్యక్తితో పాటు అతడి కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెట్లదారి నిర్మాణ పనుల ప్రారంభం

అడ్డగుట్ట: స్థానికుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపడుతున్నామని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. అడ్డగుట్ట డీ సెక్షన్‌లో ఆమె సోమవారం మెట్లదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసన్న మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని, ప్రాంతాల వారీగా సమస్యలను గుర్తించి డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సహకారంతో వాటిని పరిష్కరిస్తున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్ నేతలు లింగాని శ్రీను, జీహెచ్‌ఎంసీ డీఈ పద్మలత, ఏఈ వేణు, పార్టీ నేతలు మహ్మద్, వసంత, నర్సింగ్, గోపి, దేవయ్య, గౌస్, ఆయోధ్య తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

అడ్డగుట్ట: ఫుట్‌పాత్, రోడ్ల ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని మారేడుపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ యాదేందర్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం అడ్డగుట్ట చంద్రయ్య హోటల్ నుంచి తుకారాంగేట్ సుభాష్ బొమ్మ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ యాదేందర్ మాట్లాడుతూ రోడ్డు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణల కారణంగా పాదచారులకు, వాహనాల రాకపోకలు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. పాదచారులు నడిచేందుకు తగినంత మార్గం కూడా లేకపోవడంతో రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి ఎదురవుతుందని, తద్వారా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. అందువల్ల స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు, పాదచారులకు ఇబ్బందులు కలిగించే విధంగా ఫుట్‌పాత్, రోడ్ల ఆక్రమణలకు పాల్పడిన పలువురు దుకాణదారులకు చలాన్లు విధించారు.

మూడోసారి చోరీ !

- ఇందిరాపార్కులో యథేచ్ఛగా గంధం చెట్ల దొంగతనాలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉద్యానవన శాఖ, సిబ్బంది
- పార్కుకు రక్షణ చర్యలు చేపట్టాలని నగర వాసుల డిమాండ్



ఇందిరాపార్కు (ఫైల్)



పార్కులో గంధం చెట్లను నరికివేసిన ప్రాంతం

కవాడిగూడ: జంటనగరాలకు నడిబొడ్డున ఉన్న చారిత్రాత్మకమైన ఇందిరాపార్కులో ముచ్చటగా మూడోసారి గంధం చెట్ల చోరీ జరిగింది. ఇదే పార్కులో గతంలో రెండుసార్లు గంధం చెట్ల చోరీ జరిగిన క్రమంలో ఉద్యానశాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పార్కును కాపాడి రక్షణ చర్యలు చేపడతామని పలికిన నీతి వ్యాఖ్యలు నీటిమీద రాతలుగానే మిగిలిపోయాయి. ఉద్యానశాఖ అధికారులు గతంలో చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫలితంగానే తరచుగా చోరీలు జరుగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- నిత్యం ఆహ్లాదం, స్వచ్ఛమైన గాలి అందించే చెట్ల మధ్య నగర వాసులు ఆరోగ్యం కోసం వేలాది మంది ఉదయం, సాయంత్రం వేళల్లో కుటుంబ సమేతంగా వచ్చి వాకింగ్, యోగా, వ్యాయామం చేస్తారు.
- ఆహ్లాదాన్ని పంచే ఇందిరాపార్కును కాపాడుకోలేక పోతే భవిష్యత్తులో ఎడారిగా మారిపోయే ప్రమాదం ఉందని సందర్శకులు, వాకర్స్ ఆందోళన చెందుతున్నారు.
- అభివృద్ధి కోసం చర్యలు చేపట్టాల్సిన అధికారులు పార్కు అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- గతంలో చోరీ జరిగిన ప్రాంతాలను ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ, ఏసీపీ యాదగిరి పరిశీలించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించినా.. అధికారులు పట్టించుకోక పోవడం దురదృష్టకరం.
- ఇప్పటికైనా ఇందిరాపార్కుకు పటిష్టంగా రక్షణ చర్యలు చేపట్టి దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

కేసు నమోదు..

- సోమవారం తెల్లవారుజామున దుండగులు ఇందిరాపార్కులోకి ప్రవేశించి రంపంతో 7 చెట్లకు గాట్లు పెట్టారు. వీటిని పూర్తిగా తొలగించే క్రమంలో పార్కులో వినికిడి వినబడటంతో దుండగులు గంధం చెట్లను అక్కడే వదిలేసి పారిపోయారు.
- గతంలో రెండుసార్లు 20కి పైగా విలువైన గంధం చెట్లను నరికి తీసుకెళ్లారు. సోమవారం ఉదయమే గంధం చెట్ల నరికివేతను గమనించిన పార్కు సిబ్బంది ఉద్యానశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తామని సీఐ మోహన్‌రావు ప్రకటించారు.

ప్రారంభమైన సీఎం కప్ టోర్నమెంట్

కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ క్రీడాపోటీలు

కవాడిగూడ: సీఎం కప్ టోర్నమెంట్ కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడలోని ఫిజికల్ ఎడ్యుకేషనల్ కళాశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఈ టోర్నమెంట్స్‌లో ఫుట్‌బాల్, వాలీబాల్ అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ క్రీడలు టోర్నీ జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. ఆయన మాట్లాడుతూ.. నగర గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా నైపుణ్యం గల క్రీడాకారులు అనేక మంది ఉన్నారన్నారు. వారిలోని ప్రతిభను వెలికితీసేలా రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ టోర్నమెంట్, క్రీడా ప్రతిభ ఉండి విద్యకు దూరమైన అనేక మంది క్రీడాకారులు ప్రైవేటు సంస్థలు నిర్వహించే క్రీడల్లో నగరాలకు గ్రామాలకు పేర తీసుకొస్తున్న క్రమంలో వారికి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. క్రీడాకారులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా జీహెచ్‌ఎంసీ తగిన ఏర్పాట్లు చేస్తోందన్నారు.

- ముషీరాబాద్ హిమాయత్‌నగర్ మండలాల పరిధిలో క్రీడాకారులకు 15 నుంచి 17 వరకు నిర్వహించబడతాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి ఈ నెల 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయి పోటీలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయి టోర్నమెంట్ వివిధ జట్లలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి ఈనెల 28 నుంచి 31 వరకు జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ టోర్నమెంట్ నగరంలోని జింకానా, గచ్చిబౌలి, ఎల్బీస్టేడియం, కేబీఆర్ మైదానాల్లో నిర్వహించబడతాయన్నారు. జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ అధికారి కృష్ణ, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ కోచ్‌లు కె.కృష్ణ, విజయనంద్, మనోజ్‌రెడ్డి, పవన్ శుక్ర, ఫిజికల్ ఎడ్యూకేషనల్ టీచర్లు విజయానంద్, కిషోర్‌కుమార్, కేఎస్‌హెలెన్, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

రూ.36 లక్షలతో ఏసీ బస్టాప్‌లు



శివంరోడ్డు ఏసీ బస్టాప్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా సామాన్యులకు సైతం ఉత్తమ రవాణా సదుపాయాలను కల్పించేందుకు ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఏసీ బస్టాప్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా సోమవారం శివం రోడ్డులో రూ.36 లక్షలతో నిర్మించిన ఏసీ బస్టాప్‌ను స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైటెక్‌సిటీ లాంటి ఉన్నత శ్రేణి వర్గాలు నివసించే ప్రాంతాలతో పాటు అంబర్‌పేట్ వంటి మధ్యతరగతి ప్రజలు నివసించే ప్రాంతాల్లో కూడా ఏసీ బస్టాపులు ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ఏర్పాటు చేశామన్నారు.

- వేసవి కాలంలో ఏసీ బస్టాప్‌లు ప్రయాణికులకు ఎంతో ఉపశమనం కలిగిస్తాయన్నారు. నియోజకవర్గంలో ఫీవర్ ఆసుపత్రి, అంబర్‌పేట పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లోనూ అన్ని హంగులతో విశాలమైన బస్టాప్‌లను ప్రారంభించామన్నారు.
- నియోజకవర్గంలో మౌలిక వసతులతో పాటు ఇతర అన్ని రకాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు చంద్రమోహన్, శ్రీరాములు ముదిరాజ్, పులిజాల గెల్వయ్య, అఫ్రోజ్ పటేల్, రమేష్‌నాయక్, బాల్‌రాజ్ తదితరులున్నారు.

సామాజిక సేవకు పదవులు ప్రధానం కాదు



దేవదాసును సత్కరిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

చిక్కడపల్లి: సామాజిక సేవకు పదవులు ప్రధానం కాదని సేవా దృక్పథం ముఖ్యమని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. సోమవారం త్యాగరాయగాన సభలోని కళాసుబ్బారావు కళావేదికపై చేనేత కార్మికుల జాతీయ నాయకుడు చిక్కాదేవదాసు జన్మదిన సందర్భంగా కళానిలయం ప్రముఖ సాంస్కృతిక సంస్థ , ఓంకార సత్సంగ్ నిర్వహణలో ఆయనకు భారత సేవా ప్రపూర్ణ బిరుదు ప్రధానోత్సవం సభ జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీనివాస్ గుప్తా పాల్గొని దేవదాసును సత్కరించి మాట్లాడారు. దేవదాసు ఆధ్యాత్మిక భావాలు కలిగిన సామాజిక కార్యకర్త, ఉత్తమ రచయిత ఈ సందర్భంగా గుర్తుచేశారు. సంఖ్యాశాస్త్ర వేత్త దైవజ్ఞశర్మ అధ్యక్షత వహించిన సభలో విశ్రాంతన్యాయమూర్తి బి.మధుసూదన్, వంశీఈ రామరాజు, విశ్రాంత పోలీస్ ఉన్నతాధికారి సుంకర సత్యనారాయణ తదితరులున్నారు. బలగం సినీనటులు బాలు, అంజి, సురభి వాణీలకు సత్కారంతో పాటు వివిధ రంగ ప్రముఖులకు చిక్కాదేవదాసు ప్రతిభా పురస్కారాలు బహూకరించారు.

18న బీజేపీ బీసీ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌యాదవ్

కాచిగూడ: బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 18న నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న బీసీ సమ్మేళనంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు వినోద్‌యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం చెప్పల్‌బజార్‌లోని మహేంద్ర గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన పార్టీ సన్నాహాక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకొని వారికి ఎలాంటి సంక్షేమ పథకాలను కేటాయించకుండా అబద్ధపు ప్రచారంతో అణిచివేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు సరైన అవగాహన కల్పించేందుకు ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. అచ్చిని రమేష్, ఆవుల నరేష్, ప్రణయ్‌సింగ్, వెంకటేష్ దయాళ్, ఎంబీ కిషోర్‌కుమార్, ఎస్.వెంకటస్వామిగౌడ్, సత్యనారాయణ, వైద్యనాథ్ తదితరులున్నారు.

రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని వినతి



డీఎంసీ సర్కిల్–15 యాదయ్యకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కవాడిగూడ: భోలక్‌పూర్‌లోని కరీమియా మసీదు వద్ద పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలని మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, హిందూ శ్మశానవాటిక చైర్మన్ పాశం అనిల్‌కుమార్ యాదవ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రోడ్డు నిర్మాణ పనులను తక్షణమే చేపట్టాలని జీహెచ్‌ఎంసీ డీఎంసీ సర్కిల్–15 యాదయ్య, ఎగ్జిక్యూటింగ్ ఇంజనీర్ శ్రీనివాస్‌లకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. రోడ్డు మంజూరై నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ఈ రహదారి మీదుగా వెళ్తున్న పాదచారులు, మహిళలు, వృద్ధులు, వాహనదారులు, ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వారం రోజుల్లో తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు.

మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యం



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించటమే లక్ష్యంగా పని చేస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. పాదయాత్రల ద్వారా నిత్యం ప్రజల్లో ఉంటూ.. వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించటం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ఆయన వివిధ విభాగాల అధికారులతో కలిసి ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీ జాంబవినగర్ మార్టినెంట్ ల్ ప్రాంతంలో పాదయాత్ర నిర్వహించారు. ఆయా బస్తీల్లోని ప్రజలను నేరుగా కలిసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో చాలకాలంగా పెండింగ్‌లో ఉన్న మొండి సమస్యలను పరిష్కరించామన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బీఆర్‌ఎస్ యువజన నాయకులు ముఠా జయసింహ, జలమండలి అధికారులు మోహన్‌రాజ్, వీస్, డీఈ గీత, నర్సింగ్ ప్రసాద్, శ్రీధర్ రెడ్డి, ఆకుల అరుణ్, ఎయిర్‌టెల్ రాజు, దీన్‌దయాల్ రెడ్డి, శివ ముదిరాజ్, శ్రీకాంత్‌గౌడ్ , భిక్షపతి యాదవ్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

20న 'డబుల్' ఇళ్ల దుకాణాల వేలం



ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో ఉన్న దుకాణాల వేలం పాటను ఈ నెల 20వ తేదీన నిర్వహించాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారని డిగ్నిటీ హౌసింగ్ కమిటీ అధ్యక్షుడు బి.అనిల్, ప్రతినిధులు వెంకటేష్, వినోద్ తెలిపారు. ఇప్పటికే వేలంపాట నిర్వహించాలనుకున్నా వాయిదా పడింది. ఈ నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో సమావేశమయ్యారు. ఖైరతాబాద్ ఇందిరానగర్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ఈ నెల 20న ఉదయం 10 గంటలకు వేలంపాట నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించినట్లు తెలిపారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విఫలం



చీరలను పంపిణీ చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ

కాచిగూడ: దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో బీజేపీ పూర్తిగా విఫలమైందని దేశ వ్యాప్తంగా బీజేపీని ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అన్నారు. సోమవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఆమె పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేద మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఐసీసీ అధికార ప్రతినిధి పవన్ ఖేరాతో కలిసి ఆమె మాట్లాడారు. వ్యక్తులు, కుటుంబాలు, సంఘాల శ్రేయస్సును మెరుగుపరిచేందుకు ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని కోరారు. సామాజిక సేవలు బలహీనుల సంక్షేమాన్ని రక్షించి ప్రోత్సహించేందుకు చట్టబద్ధమైన బాధ్యతను కలిగి ఉంటాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ తప్పిదాలను కాంగ్రెస్ ఎప్పటికప్పుడు ఎండగడుతూనే ఉందని 'తెలంగాణను ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేది కూడా కాంగ్రెస్ పార్టీయే' అన్నారు.

క్రైస్తవులకు అన్ని విధాలుగా అండగా ప్రభుత్వం

చిక్కడపల్లి: క్రైస్తవులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఉండగా ఉందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం చిక్కడపల్లిలో ముషీరాబాద్ మెయిన్ చర్చిల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు క్రిస్టియన్ ఎమ్మెల్సీ గా టీయూసీపీఏ ప్రధాన కార్యదర్శి గోనె సోల్మన్‌రాజ్‌కు ఈసారి అవకాశం కల్పించాలన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వ పథకాలను అమలు చేస్తోందన్నారు. తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ (టీయూసీపీఏ) ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ సెక్యులర్ పార్టీ అని క్రైస్తవుల సంక్షేమం, అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. 83 నియోజవర్గాల్లో ఉన్న పాస్టర్లు తనకు మద్దతు తెలిపారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. పాస్టర్లు జయప్రకాష్, డాక్టర్ జాయ్ చెరియన్, అనూప్ కుమార్, మత్రిదాసు, డేవిడ్ విజయరాజ్, పమ్మి డేనియల్, డేవిడ్‌రాజ్, హేమలత, రేణుక, షాలిని తదితరులున్నారు.

అంసా అధ్యక్షులుగా నామ సైదులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) అధ్యక్షులుగా నామ సైదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఓయూలో జరిగిన అంసా రాష్ట్ర స్థాయి సమావేశంలో ఓయూ లా విద్యార్థి నామ సైదులును ఎంపిక చేసిన్నట్లు అంసా రాష్ట్ర అధ్యక్షులు అంగరి ప్రదీప్, ప్రధాన కార్యదర్శి మంచాల లింగస్వామి తెలిపారు.

శ్మశానవాటిక సుందరీకరణకు ప్రతిపాదనలు



చిలకలగూడ : సీతాఫల్‌మండి హిందూ శ్మశానవాటిక సుందరీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు స్థానిక కార్పోరేటర్ సామల హేమ తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఈఈ ఆశాలత, ఏఈ కౌశిక్‌లతో కలిసి సోమవారం శ్మశానవాటికను సందర్శించి పలు అంశాలపై చర్చించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం వైకుంఠధామాల సుందరీకరణ, వసతులు, సౌకర్యాలపై దృష్టి సారించినట్లు తెలిపారు.

పూడికతీత పనుల పరిశీలన

డివిజన్ పరిధిలోని ప్రైడేమార్కెట్, శ్రీనివాసనగర్, షాబాద్‌గూడ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పోరేటర్ సామల హేమ జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సోమవారం పర్యటించి నాలా పూడికతీత పనులను పరిశీలించారు.

'భోలక్‌పూర్ అభివృద్ధికి బీఆర్‌ఎస్ కృషి'



కోక రవీంద్రతో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ డివిజన్ ప్రతినిధులు

కవాడిగూడ: కోట్లాది రూపాయలు వెచ్చించి కలుషిత తాగునీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థను శాశ్వతంగా పరిష్కరించిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీ, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు దక్కుతుందని ఆ పార్టీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్, నగర యువజన విభాగం నాయకుడు రవీంద్ర అన్నారు. సోమవారం డివిజన్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం పాటిస్తూ.. అందరి అభివృద్ధిని కోరుకునే ఏకైక సీఎం కేసీఆర్ మాత్రమేనని కొనియాడారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ సైతం నిత్యం భోలక్‌పూర్ డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఇతర పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి, గులాబీ జెండాను మరోసారి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు శివ, ఆంజనేయులు, రాము, కిరణ్ కుమార్, శ్రీనివాస్, ఎల్లయ్య, చంద్రకాంత్ తదితరులున్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనుల పరిశీలన



డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మండలి అధికారి, బీజేపీ నేతలు

కవాడిగూడ: డివిజన్ ఫూల్‌బాగ్ ప్రాంతంలోని ఇందిరాపార్కు చౌరస్తా పోచమ్మ దేవాలయం వద్ద డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఇబ్బంది కలుగుతోంది. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ.. ఆలయ నిర్వాహకులు కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ రచనశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆమె జలమండలి అధికారులతో చర్చించి తక్షణమే ఆలయ ప్రాంగణంలో డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టాలని ఆదేశించారు. కార్పొరేటర్ సూచన మేరకు జలమండలి అధికారులు నూతన ఏర్పాటు పనులను ప్రారంభించారు. సోమవారం జలమండలి సెక్షన్ మేనేజర్ శ్రీధర్, బీజేపీ రాష్ట్ర నాయకులు పరిమళ్‌కుమార్, వెంకటేష్, ఎంసీ మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర, యువ మోర్చా అధ్యక్షుడు మోహన్‌సాయి, బాణాల అనిల్‌కుమార్, దిలీప్‌యాదవ్, ఎస్సీ మోర్చా డివిజన్ ప్రధాన కార్యదర్శి శివరాజ్ తదితరులున్నారు.

వేర్వేరు ఘటనల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

- నిందితుల అరెస్ట్, రిమాండ్
- రూ.లక్ష మేర సుంకం ఎగవేత, మద్యం స్వాధీనం



అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు



మద్యం బాటిళ్లతో పట్టుబడిన నిందితులు

ముషీరాబాద్: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ. లక్ష విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, డీటీఎస్‌పీఐ శివజ్యోతి, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్‌లు వివరాలను వెల్లడించారు. ప్రైవేటు ఉద్యోగులు అశోక్ చౌదరి, కిషోర్‌వర్మలు సోమవారం తెల్లవారు జామున ఆటోలో ముషీరాబాద్ నుంచి సికింద్రాబాద్ వైపు సుంకం చెల్లించని విలువైన మద్యం బాటిళ్లను తరలిస్తుండగా.. ఈ క్రమంలో సికింద్రాబాద్ బోయిగూడ వద్ద నిఘా వేసిన ఎక్సైజ్ పోలీసులు పిల్లర్ నెంబర్ 1014 వద్ద నుంచి అనుమానస్పదంగా వెళ్తున్న ఆటోను ఆపి తనిఖీలు చేయటంతో మద్యం బాటిళ్ల తరలిస్తున్నట్లు తెలిసింది. నిందితులు ఇద్దరు సుంకం చెల్లించని మద్యం బాటిళ్లను పార్టీల కోసం ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా చేస్తున్నట్లు అంగీకరించారు. ఈ మేరకు ఎక్సైజ్ పోలీసులు నిందితుల వద్ద నుంచి లక్ష రూపాయల విలువైన 68 మద్యం బాటిళ్లు, ఆటో, సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

కాచిగూడ: అక్రమంగా తరలిస్తున్న 36 మద్యం సీసాలను నారాయణగూడ ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. నారాయణగూడ ప్రోహిబీషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణగూడ తాజ్‌మహల్ హోటల్ ఎదురుగా రూట్‌వాచ్ చేస్తూ.. అనుమానస్పద వాహనాలను తనిఖీ చేస్తుండగా.. ఆటో ట్రాలీ (టీఎస్ 10యూబీ2203)ని ఆపి తనిఖీ చేయగా.. 3 కాటన్‌ల మద్యం సీసాలు లభ్యం కాగా.. ఆటోలోని వారికి విచారించగా జార్ఖండ్‌కు చెందిన బిట్టుసింగ్ (26), హిమాయత్‌నగర్ కింగ్‌కోఠికి చెందిన సయ్యద్ సాధిక్ పాషా (38)లు పొంతనలేని సమాధానాలు చెప్పారు. బాటిళ్లను పరిశీలించగా వాటిపై ఎలాంటి ధరల స్టిక్కర్, వివరాలు, లేబుళ్లు లేవు. చివాస్ రీగల్ వీస్కి సీసాలు (12), జాన్ లీవ్ బ్లాక్ లేబుల్ విస్కీ సీసాలు (24) నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి అనంతరం రిమాండ్‌కు తరలించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383